
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



5 సిద్దిపేట

శుక్రవారం 27 జూన్ 2025



మాత శిశు ఆరోగ్య కేంద్రం

నేడు మాతా శిశు ఆరోగ్య కేంద్రం ప్రారంభం

- 150 పడకల ఆసుపత్రికి..
- కొత్తపల్లి నుంచి హుస్నాబాద్‌కు ఫోర్‌లేన్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన
- హాజరుకానున్న నలుగురు మంత్రులు

హుస్నాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్‌లో రూ. 11.50 కోట్లతో నిర్మించిన 50 పడకల మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం మంత్రులు పొన్నం ప్రభాకర్ దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రారంభించనున్నారు. అనంతరం రూ. 82కోట్లతో నిర్మించే 150 పడకల ఆసుపత్రి భవనానికి, రూ. 77.20 కోట్లతో కొత్తపల్లి టూ హుస్నాబాద్ వరకు ఉన్న రెండు లేన్ల రహదారిని, నాలుగు లేన్లకు మార్చే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఆ తర్వాత పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగే కార్యక్రమంలో వారు మాట్లాడుతారు. నలుగురు మంత్రులు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు వస్తున్న సందర్భంగా గురువారం కలెక్టర్ హైమావతి, అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్‌తో కలసి సంబంధిత ఏర్పాట్లను పరిశీలించారు. మాత శిశు ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చెర్మన్ కేడం లింగమూర్తి, ఆర్డీవో రామ్మూర్తి, ఆసుపత్రి సూపరింటెండెంట్ రామ్మూర్తి, సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య, చిత్తారి రవీందర్, మడప జైపాల్‌రెడ్డి తదితరులున్నారు.

నాచగిరి క్షేత్ర హుండీ ఆదాయం రూ. 26 లక్షలు



వర్గల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): వర్గల్ మండలం నాచారం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్ర హుండీ లెక్కింపు గురువారం నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ సిద్దిపేట జిల్లా ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి పర్యవేక్షణలో ఈ లెక్కింపు చేపట్టారు. 100 రోజులకు గాను రూ.26,26,346 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి విజయ రామరావు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు సుధాకర్, నరేందర్, పాండు, నర్సింహులు, పోలీస్ అవుట్‌పోస్ట్ సిబ్బంది, శ్రీ భమరాంబిక సేవా సమితి, శివశక్తి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

డెడ్‌లైన్ ఆగస్టు 15

భూ భారతి దరఖాస్తుల పరిష్కారానికి గడువు

గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణిలో లోపాలున్నాయంటూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నూతన ఆర్‌వోఆర్-2025 చట్టాన్ని తీసుకొచ్చింది. దీనికి భూ భారతిగా నామకరణం చేసి ఈ ఏడాది ఏప్రిల్‌లో పథకానికి శ్రీకారం చుట్టింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 25 మండలాల్లోని అన్ని గ్రామాల్లో అమలు చేసింది. అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలపై 42 వేలకు పైగా దరఖాస్తులను స్వీకరించారు. వీటిని ఆగస్టు 15లోగా పరిష్కరించాలని ప్రభుత్వం డెడ్‌లైన్ విధించింది. దీంతో అసలు ఘట్టానికి రెవెన్యూ అధికారులు సిద్ధమవుతున్నారు.

- సిద్దిపేట ఆంధ్రజ్యోతి, జూన్ 26

- జిల్లావ్యాప్తంగా 42,639 దరఖాస్తులు
- ముగిసిన రెవెన్యూ సదస్సులు
- అత్యధికంగా దుబ్బాకలో 3వేలు, అత్యల్పంగా మద్దూరులో 600 దరఖాస్తులు
- 80 శాతానికి పైగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్
- సాదాబైనామా దరఖాస్తులు 11 వేలకు పైగానే
- పరిష్కారానికి అధికారుల కసరత్తు

భూసమస్యల పరిష్కారానికి ఈ నెల 3 నుంచి 20 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించగా దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఆయా గ్రామాల్లో జరుగుతున్న సదస్సులను అధికారులతో కలిసి కలెక్టర్ హైమావతి పరిశీలించారు. గత కొన్ని నెలలుగా ధరణి పోర్టల్‌లో ఆన్‌లైన్ ప్రక్రియ మూసివేయడంతో ఎలాంటి సేవలకు అవకాశం లేకుండాపోయింది. ప్రభుత్వం భూ భారతి పోర్టల్‌లో సేవలను ప్రారంభించడంతో భూ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ప్రజలు, రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో భాగంగా మొత్తంగా 42,639 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ప్రధానంగా సాదాబైనామా, పీవో టీ, సర్వే నంబర్లలో

మిగతా 8వ పేజీలో

రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల్లో ప్రధాన సమస్యలివే....

1.	సాదాబైనామా	11,230
2.	పీవోటీ	9,054
3.	మిస్సింగ్ సర్వేనంబర్	7,629
4.	విస్తీర్ణం	2,171
5.	అసైండ్‌మెంట్ సమస్యలు	2,169
6.	సక్సేషన్	2,106
7.	అప్పీళ్లు	1,724
8.	పెండింగ్ మ్యుటేషన్	1,589
9.	డీఎస్ పెండింగ్	1,278
10.	శివైజమీదార్	759
11.	పట్టదారు వివరాలు	685

భూ భారతి కింద వచ్చిన దరఖాస్తులు మండలాల వారీగా

1.	దుబ్బాక	3347
2.	కోహెడ	2845
3.	గజ్వేల్	2795
4.	నంగునూర్	2663
5.	దౌల్తాబాద్	2345
6.	చిన్నకోడూర్	2335
7.	అక్బర్‌పేట-భూంపల్లి	2316
8.	చేర్యాల	2154
9.	జగదేవ్‌పూర్	2113
10.	కొండపాక	1821
11.	సిద్దిపేట రూరల్	1679
12.	రాయపోల్	1637
13.	వర్గల్	1617
14.	కుకునూర్‌పల్లి	1387
15.	తొగుట	1359
16.	హుస్నాబాద్	1297
17.	బెజ్జంకి	1259
18.	నారాయణరావుపేట	1153
19.	కొమురవెల్లి	1131
20.	మర్కుక్	1131
21.	మిరుదొడ్డి	1064
22.	దూళిమిట్ట	888
23.	ములుగు	861
24.	సిద్దిపేట అర్బన్	763
25.	మద్దూరు	679
	మొత్తం	42,639





ఘనంగా శాకంబరి

నవరాత్రోత్సవాలు

ఆషాడమాసాన్ని పురస్కరించుకుని చేర్యాలలోని దుర్గమ్మ ఆలయంలో శాకంబరి నవరాత్రోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవ నిర్వహకులు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకం, ఫల, పుష్ప కుంకుమాభిషేకం జరిపారు.

- చేర్యాల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి)

సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేట కల్చరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని టీఎస్ ఎస్సీ స్టడీ సర్కిల్లో సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని ఓయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మూడవత్ రవినాథ్, స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని సిద్దిపేట పీజీ కళాశాలలో ఆవిష్కరించి మాట్లాడారు. సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు జూలై 7లోపు ఆన్‌లైన్‌లో టీఎస్ స్టడీ సర్కిల్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు జూలై 13న ప్రవేశ పరీక్ష నిర్వహించి అందులో వచ్చిన మెరిట్ ఆధారంగా 100 మంది అభ్యర్థులను ఎంపిక చేస్తారని తెలిపారు. ఎస్సీలకు 75, ఎస్టీలకు 10, బీసీలకు 15 శాతం సీట్లు, ఇందులో మహిళలకు 33 శాతం, పీడబ్ల్యూడీ వారికి 5శాతం సీట్లు కేటాయిస్తారని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు డిగ్రీ పూర్తి చేసి ఉండాలన్నారు. వారి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3లక్షలు మించరాదని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు 10 నెలల పాటు ఉచిత రెసిడెన్షియల్‌తో కూడిన శిక్షణ ఉంటుందని తెలిపారు.

'డబుల్' ఇళ్ల కోసం నిర్వాసితుల ధర్నా

- పెట్రోల్ డబ్బాతో బాధితుడి హల్‌చల్ - అడ్డుకున్న ఇన్‌స్పెక్టర్



పెట్రోల్ డబ్బాతో బాధితుడు స్వామి

గజ్వేల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం బాధితులు గజ్వేల్‌లోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద గురువారం ధర్నాకు దిగారు. ఈ క్రమంలో స్వామి అనే ఓ నిర్వాసితుడు పెట్రోల్ డబ్బాతో హల్‌చల్ చేశాడు. గమనించిన గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా అక్కడికి చేరుకుని నిర్వాసితుడు స్వామి చేతులో నుంచి పెట్రోల్ డబ్బాను లాక్కున్నారు.

క్యాసారం రోడ్డు విస్తరణలో భాగంగా పూర్తిగా ఇళ్లను కోల్పోయిన నిర్వాసితులకు తాత్కాలికంగా నివాసం ఉండేందుకు గజ్వేల్‌లోని డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించారు. లాటరీ ద్వారా ఇళ్లను పొందిన లబ్దిదారులు తమకు సదరు ఇల్లు వచ్చిందని, ఖాళీ చేయాలని తమపై ఒత్తిడి తెస్తున్నారని నిర్వాసితులు ఆవేదన చెందారు. గతంలో తమకు తాత్కాలిక ఇళ్లను ఇచ్చిన ప్రభుత్వం ప్రస్తుతం రోడ్డుపైకి తీసుకువచ్చిందని వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

నిజాయితీగా విధులు నిర్వర్తించాలి

- సీపీ అనురాధ

చేర్యాల/మద్దూరు జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అధికారులు, సిబ్బంది నీతి నిజాయితీతో విధులు నిర్వర్తించాలని సిద్దిపేట సీపీ అనురాధ అన్నారు. చేర్యాల మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను, మద్దూరు పోలీసుస్టేషన్‌ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పెండింగ్ కేసులు, పాత నేరస్తులు, తదితర విషయాలపై ఆరా తీసి పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజల రక్షణే ధ్యేయంగా పోలీసు అధికారులు, సిబ్బంది క్రమశిక్షణతో పనిచేయాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని, విధులతో పాటు ఆరోగ్యంపై దృష్టి సారించాలని, వీపీవోలకు కేటాయించిన గ్రామాల్లో సమాచార వ్యవస్థను మెరుగుపర్చుకోవాలని సూచించారు. అంతకుముందు సీపీ చేర్యాల స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. ఆయా కార్యక్రమాల్లో హుస్నాబాద్ ఏసీపీ సదానందం, చేర్యాల సీఐ ఎల్.శ్రీను, ఎస్‌ఐ నీరేశ్, మద్దూరు ఎస్‌ఐ షేక్ మహబూబ్ అలీ, సీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, కోర్టు మానిటర్ ఎస్‌ఐ రాజేష్, ఏఎస్‌ఐ సదాశివరావు, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, నరేందర్, నాగిరెడ్డి, జనార్దన్ పాల్గొన్నారు.

'పేపరోళ్లకు చెప్పారు.. మేం డబ్బులివ్వం'

- జాలిగామ నిధుల గోల్‌మాల్ విషయంలో రైతులతో ఐకేపీ అధికారుల దురుసు ప్రవర్తన

7

జైళ్ల శాఖ పెట్రోల్ బంకులో.. సీడ్ బాల్స్ పంపిణీ

- పచ్చదనం పెంపొందించేందుకు వినూత్న ప్రయత్నం
- 25 వేల విత్తన బంతులు తయారు చేసిన ఖైదీలు

7

గజ్వేల్, ప్రజ్ఞాపూర్ బస్టాండ్‌లను అందుబాటులోకి తెస్తాం

- పంచాయతీ రాజ్ ఈఈ చిరంజీవాచారి

8

విద్యార్థుల నడ(ర)క యాతన

- హుస్నాబాద్ పాలిటెక్నిక్ కళాశాలకు రోజూ మూడు కిలోమీటర్ల నడక ..
- హాస్టల్ వసతి లేక విద్యార్థుల అవస్థలు
- ఎనిమిది సంవత్సరాలుగా రెండు కోర్సులే..
- ఈ ఏడాది ఇదే కాలేజీలో ఇంజనీరింగ్ తరగతులు
- 'ఏటీసీ' కూడా దీని స్థలంలో నిర్మాణం..



కళాశాల వెళ్లేందుకు హుస్నాబాద్ పట్టణ శివారులో లిఫ్ట్ కోసం ఉన్న విద్యార్థులు

హుస్నాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలోని కిషన్‌నగర్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రారంభమై ఎనిమిదేళ్లు గడుస్తున్నా హాస్టళ్లు ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కళాశాల పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉండడంతో విద్యార్థులు నడ(ర)క యాతన పడుతున్నారు. ఇక ఇన్నేళ్లయినా కేవలం రెండు కోర్సులతోనే కొనసాగిస్తున్నారు. లెక్చరర్ పోస్టులతో పాటు, లైబ్రేరీయన్, పీడీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అనేక సమస్యలు వేధిస్తుండడంతో ఇందులో చేరడానికి విద్యార్థులు విముఖత చూపుతున్నారు. కరీంనగర్, మెదక్, వరంగల్ జిల్లాల సరిహద్దులో ఉన్న ఈ కళాశాలలో తిష్ట వేసిన సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

2017లో ప్రారంభం..

హుస్నాబాద్‌కు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కిషన్‌నగర్‌లో పదెకరాల స్థలంలో జీప్లస్ వన్ భవనంతో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను నిర్మించి 2017లో ప్రారంభించారు. డిప్లొమా సివిల్ ఇంజనీరు, డిప్లొమా ఎలక్ట్రికల్ ఇంజనీరు కోర్సులతో ప్రతి ఏడాది ప్రతి కోర్సులో 60 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తున్నారు. ఇది ప్రారంభమై ఎనిమిదేళ్లు కావస్తున్నా సాంప్రదాయ ఇంజనీరింగ్ కోర్సులే తప్ప సాంప్రదేయేతర ఉద్యోగవకాశాలు లభించే కోర్సులను ప్రారంభించకపోవడంతో ఇక్కడ చదువుకోవడానికి విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి కోర్సులను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

మూడు కిలోమీటర్ల నడక..

హుస్నాబాద్‌కు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లేందుకు ఉదయం 8 గంటలకే పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి అక్కన్నపేట రోడ్డు స్థూపం వరకు విద్యార్థులు బారులు తీరుతారు. ద్విచక్ర వాహనదారులను, ట్రాక్టర్లు, ఇతర వాహనాలను లిఫ్ట్ అడుగుతూ ఇబ్బందులు పడుతుంటారు. ఆటోలో వెళ్లాలంటే రూ. 50 చెల్లించాలి. పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ మేనేజ్ మెంట్ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు బస్టాండ్ వరకు రావాలంటే కిలోమీటరు నుంచి రెండు కిలోమీటరు వరకు ఉంటుంది. బస్టాండ్ నుంచి పాలిటెక్నిక్ కళాశాలకు మరో మూడు కిలోమీటర్లు ఉంటుంది. ఇలా నడకతో విద్యార్థులు అలసట చెందుతున్నారు. కళాశాలకు తక్కువ దూరం కావడంతో బస్‌పాస్‌కు అవకాశం ఉండడం లేదు. ఇక సమయానికి బస్సులు కూడా ఉండడం లేదని ఒక వేళ బస్సు ఉన్నా కూడా కిషన్‌నగర్‌లో దిగి కళాశాల వద్దకు మరో ఆఫ్ కిలోమీటర్ దూ రం నడవాల్సి వస్తుందని పలువురు

మిగతా 8వ పేజీలో

మత్తు.. ముట్టుకుంటే చిత్తు

- ముగిసిన యాంటీ డ్రగ్స్ అవెర్నెస్ వారోత్సవాలు
- జిల్లాలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు

సిద్దిపేట క్రైం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోలీసు అధికారులు, గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. నిత్యం వాహనాల తనిఖీలు చేపట్టి మత్తు పదార్థాల సరఫరా చేసే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగానే యాంటీ డ్రగ్స్ అవెర్నెస్ వారోత్సవాల పేరిట మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ నెల 21న యాంటీ డ్రగ్స్ అవెర్నెస్ వారోత్సవాలు ప్రారంభం కాగా గురువారంతో విజయవంతంగా ముగిశాయి. ఈ వారోత్సవాల్లో భాగంగా పల్లెలు, పట్టణాలు, పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈ వారోత్సవాల్లో విద్యార్థులకు యాంటీ డ్రగ్స్‌పై వ్యాసరచనపోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. విద్యార్థులకు త్వరలో యాంటీ డ్రగ్స్ సోల్జర్ సర్టిఫికెట్ ఇవ్వనున్నారు. పట్టణాలలో ర్యాలీలు మానవహారాలు నిర్వహించి, బస్టాండ్ల వద్ద చౌరస్తాల వద్ద రద్దీగల ప్రాంతాలలో ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసి నార్కోటిక్ డాగ్స్‌తో అనుమానస్పద ప్రాంతాల్లో, పాన్‌షాక్, కిరాణా దుకాణాల్లో పోలీసులు ప్రతిరోజు తనిఖీలు చేపడుతున్నారు. ఎవరైనా ఎక్కడైనా గంజాయి, డ్రగ్స్ విక్రయించినట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని పోలీసులు సూచిస్తున్నారు.



హుస్నాబాద్ టౌన్ : మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, అధికారులు, విద్యార్థులు

యువత డ్రగ్స్ బారిన పడకూడదు

సిద్దిపేట కల్చరల్/హుస్నాబాద్ టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): యువత డ్రగ్స్ బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని కలెక్టర్ హైమావతి సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీపీ అనురాధతో కలిసి కలెక్టర్ హైమావతి పాల్గొన్నారు. జూనియర్ కాలేజీ నుంచి మోడ్రన్ బస్టాండ్ వరకు వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అలాగే హుస్నాబాద్‌లో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ అవేర్నెస్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలో అంబేడ్కర్ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న ప్రభుత్వ సంకల్పంలో భాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మానవహారం నిర్వహించి మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, ఆర్డీవో రామ్మూర్తి, జేఏసీ నియోజకవర్గ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి, సీఐ శ్రీనివాస్, కమిషనర్ మల్లిఖార్జున్, ఎస్‌ఐ తోట మహేశ్, పలువురు పాల్గొన్నారు.

రాళ్లను తొలగించిన రిసార్ట్ నిర్వాహకులు



రిసార్ట్ ఎదుట తీసేసిన రాళ్లు

వర్గల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ నుంచి రామగుండం వరకు ఉన్న రాజీవ్ రహదారిపై వర్గల్ మండలం గౌరారం వద్ద ఓ రిసార్ట్ నిర్వాహకులు వాహనాలు నిలుపకుండా రోడ్డుపై పెద్ద పెద్ద గ్రానైట్ రాళ్లను ఏర్పాటు చేసిన విషయాన్ని 'ఆంధ్రజ్యోతి'లో 'రాజీవ్ రహదారిపై రిసార్ట్ నిర్వాహకులు అరాచకం' అనే శీర్షిక ప్రచురితమైన విషయం తెలిసిందే. గురువారం రిసార్ట్ నిర్వాహకులు సదరు రాళ్లను తొలగించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు 'ఆంధ్రజ్యోతి' దిన పత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.

తక్కువ ధరకు బంగారం పేరుతో కుచ్చుటోపీ

గజ్వేల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలో మరో గోల్‌మాల్ బాగోతం బయటపడింది. గజ్వేల్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి, రాయపోల్ మండలానికి చెందిన మరో వ్యక్తితో కలసి తక్కువ ధరకు గోల్డ్ ఇస్తామని నమ్మించి పలువురి వద్ద నుంచి డబ్బులను వసూలు చేసి కుచ్చుటోపీ పెట్టారు. గజ్వేల్, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన పలువురితో కలసి దాదాపుగా రూ.4 కోట్లను వసూలు చేసినట్లు తెలుస్తుంది. హైదరాబాద్‌కు చెందిన పలు ప్రాధాన్యం కలిగిన గోల్డ్ షోరూంల నుంచి జీఎస్టీ లేకుండా తమకు బంగారం వస్తుందని, తాము దాదాపుగా రూ.5 నుంచి రూ.10వేలకు తక్కువకు ఇస్తామని నమ్మించి మోసం చేసినట్లు తెలిసింది. ఈ విషయమై పెట్టుబడులు పెట్టిన పలువురు ఇబ్బందులకు గురవడమే కాకుండా పెట్టుబడులు స్వీకరించిన వ్యక్తుల ఇళ్లకు వెళ్లి నిలదీస్తున్నట్లు తెలిసింది.

నత్తనడకన నర్సింగ్ కాలేజీ భవనం

●2023 జూలైలో రూ34కోట్లతో నిర్మాణానికి అనుమతి
●పూర్తయిన రూ.12 కోట్ల పనులు.. విడుదలైంది రూ.8 కోట్లు
●బిల్లులు రాక పనులు నిలిపేసిన కాంట్రాక్టర్

సంగారెడ్డి అర్బన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని రాజంపేట రోడ్డులో నిర్మిస్తున్న నర్సింగ్ కాలేజీ, హాస్టల్ భవనాల నిర్మాణ పనులు కొన్ని నెలలుగా నత్తనడకన సాగుతున్నాయి. నిధుల విడుదలలో ప్రభుత్వం చేస్తున్న జాప్యం ఫలితంగా భవనాల నిర్మాణ పనులు చేపట్టేందుకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. పూర్తి చేసిన పనులకు కూడా ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో మిగిలిన పనులు కొనసాగించడానికి కాంట్రాక్టర్లు ఆసక్తి చూపడం లేదు. ఫలితంగా భవనాల నిర్మాణ బాధ్యతలను చేపట్టిన ప్రభుత్వ ఏజెన్సీ చేసేదేమీ లేక మౌనంగా ఉండాల్సి వస్తున్నది. దీంతో ఇటు ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు నిధుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మ ప్రాతినిధ్యం వహిస్తున్న సంగారెడ్డి జిల్లాలో ఈ పరిస్థితులు ఉండడం గమనార్హం.

రూ.34 కోట్లతో కళాశాల, హాస్టల్ భవనాలు

రెండంతస్తుల నర్సింగ్ కాలేజీ భవనం, రెండంతస్తుల హాస్టల్ భవన నిర్మాణాలకు ప్రభుత్వం 2023 జూలైలో రూ.34 కోట్లు కేటాయించింది. వీటి నిర్మాణ బాధ్యతలను టీ.జీ.ఎం.ఎస్.ఐ.డీ.సీ అప్పగించింది. కాంట్రాక్టర్ కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం నర్సింగ్ కాలేజీ, హాస్టల్ భవన నిర్మాణాలన్నీ 2024 అక్టోబరులో పూర్తి చేసి ప్రభుత్వానికి అప్పగించాలి. కానీ పనులు పూర్తికాకపోవడంతో అగ్రిమెంట్ గడువును 2025 మే వరకు పొడిగించారు. అయినా పనుల్లో ఏ మాత్రం పురోగతి కనిపించడం లేదు. దీంతో తాజాగా మళ్లీ అగ్రిమెంట్ గడువు పెంపు కోసం కాంట్రాక్టర్ దరఖాస్తు చేసుకున్నారు.

రూ.12 కోట్ల పనులు పూర్తయినా...

నర్సింగ్ కాలేజీ, హాస్టల్ భవనాల నిర్మాణాలకు సంబంధించి ఇప్పటి వరకు కాంట్రాక్టర్ రూ.12 కోట్ల వరకు పనులు చేయగా, ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి సుమారు రూ.8 కోట్ల వరకు నిధులు మంజూరు చేసినట్టు తెలిసింది. చేసిన పనుల వరకు సర్కారు నిధులు విడుదల చేయకపోవడంతో మిగిలిన నిర్మాణాలను ఎలా చేపట్టాలంటూ సదరు కాంట్రాక్టర్ ప్రశ్నలకు అధికారులు సరైన సమాధానాలు ఇవ్వలేకపోతున్నారు. నిధుల విడుదలలో సర్కారు చేస్తున్న జాప్యం మూలంగా నర్సింగ్ కాలేజీ, హాస్టల్స్ అద్దె భవనాల్లో కొనసాగించే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, మంత్రి ప్రత్యేక దృష్టి సారించి నిధుల విడుదలకు చొరవ చూపిస్తే తప్పా పనులు ఇప్పట్లో పూర్తి అయ్యే అవకాశాలు లేవు.


సంగారెడ్డిలోని రాజంపేట రోడ్డులో నిర్మాణ దశలోనే నర్సింగ్ కాలేజీ హాస్టల్ భవనాలు

'బడి' నిధులు పక్కదారి

మద్దూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : గత విద్యాసంవత్సరం పాఠశాలలు తెరుచుకునే నాటికి అత్యవసర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అమ్మఆదర్శ కమిటీలకు అందించిన నిధులను చైర్‌పర్సన్లు తూతూ మంత్రంగా ఖర్చు చేసి పక్కదారి పట్టించి చేతులు దులుపుకున్నారు.. పాఠశాల విద్యాశాఖ ద్వారా అమ్మఆదర్శ కమిటీలకు ప్రభుత్వ పాఠశాలల్లో అత్యవసర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు గత విద్యాసంవత్సరంలో మద్దూరు మండలానికి 82.65 లక్షలు మంజూరు చేసింది. పాఠశాలలు తెరుచుకునే నాటికి పాఠశాలల్లోని అత్యవసర సదుపాయాలు కల్పించాలని సూచించింది. ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి పాఠశాలల్లో నెలకొన్న చిన్న చిన్న మరమ్మతులు, మరుగుదొడ్లు, మూత్రశాలల పునరుద్ధరణ, విద్యుద్ధీకరణ పనులు చేపట్టేందుకు అమ్మఆదర్శ కమిటీల సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ చైర్‌పర్సన్లు పనులు చేపట్టగా మరికొందరు పనుల్ని తూతూ మంత్రంగా చేపట్టినా ఉన్నతాధికారులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు పర్యవేక్షణ చేయడంలో నిర్లక్ష్యం వహించారన్న ఆరోపణలున్నాయి. ఇందులో భాగంగానే ధర్మారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు రూ.6,40 లక్షలు మంజూరయ్యాయి. మరుగుదొడ్లు, నీటి సంపు, చేతుల శుభ్రతకు నల్లా బిగింపు, స్టేజీతో పాటు శిథిలావస్థలోని గదులకు ప్లాస్టరింగ్, రెండు గదుల్లో బండలు, విద్యుద్ధీకరణ పనులు చేపట్టారు. శిథిలావస్థలోని రెండు గదులు ఎందుకు పనికి రాకుండా ఉండటంతో పాటు హెచ్ఎం గది పనికిరాకుండా ఉంది. వర్షాలకు గోడలు దమనెక్కుతుండటంతో ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితులున్నాయి. మరో రెండు కొత్త గదుల్లో ఒక దానిని అంగన్‌వాడీకి ఇవ్వగా మరోక గదిలో 1 నుంచి 5 తరగతులు నిర్వహిస్తూ వస్తున్నారు. ఒక్కోసారి వరండాలో కూర్చోబెట్టి విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తున్నారు. శిథిలావస్థలోని మూడు గదుల్ని తొలగించేందుకు ఎంఈవోతో పాటు ఉన్నతాధికారులకు రాతపూర్వకంగా తెలియపర్చినట్లు పాఠశాల ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఇప్పటికైనా పాఠశాలల్లో నెలకొన్న సమస్యల్ని సందర్శించి నిధుల పక్కదారిపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


ధర్మారం గ్రామంలో శిథిలావస్థలోని ప్రాథమిక పాఠశాల

ఆశచూపి మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

చేర్యాల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరిట ఆశజూపి రుణాలిస్తామ ని నమ్మబలికించి మోసానికి పాల్పడిన ఓ వ్యక్తిని చేర్యాల పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం చేర్యాల సర్కిల్ కార్యాలయంలో సీఐ ఎల్. శ్రీను నిందితుడి వివరాలు వెల్లడించారు. నాగర్ కర్నూలు జిల్లా ఊరవకొండ మండలానికి చెందిన పిల్లెల శ్రీకాంత్ కొంతకాలంక్రితం తెలంగాణ రియల్ ఎస్టేట్ వ్యాపారుల సంక్షే మం సంఘం పేరిట వాట్సప్ గ్రూప్ క్రియేట్ చేశారు. అందులో రియల్ ఎస్టేట్ వ్యాపారులను చేర్చసాగాడు. అనంతరం జాతీయ రియల్ ఏస్టేట్ సంఘం ద్వారా రుణాలు అందిస్తామని, అందుకు రూ.25వేలు చెల్లించి సభ్యత్వరుసుము తీసుకోవాలని సూచిస్తూ పోస్ట్ చేయడంతో చేర్యాల మండలం చిట్యాల గ్రామానికి చెందిన చంద్రమౌళి గమనించి శ్రీకాంత్‌ను వివరాలు అడిగితెలుసుకున్నాడు. దీంతో చంద్రమౌళి రూ.25వేలు గూగుల్‌పే యాప్ ద్వారా రెండు విడ తలలో ట్రాన్స్‌ఫర్ చేశాడు. తరువాతనుండి పిల్లెల శ్రీకాంత్ ఎంతకీ ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో ఎలాంటి సమాచారం అందించకపోవడంతో మోసపోయినట్లు నిర్ధారించుకున్నాడు. ఈవిష యమై ఇటీవల చేర్యాల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సైబర్ క్రైమ్ కేసు నమోదు చేసి పరిశోధన చేపట్టి నిందితుడిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు సీఐ ఎల్. శ్రీను తెలిపారు. కాగా ప్రజలు ఉచితాలను చూసి మోసపోకూడదని, అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో ఎస్ఐ నీరేశ్‌ఉన్నారు



నిందితుడి అరెస్ట్ వివరాలు వెల్లడిస్తున్న చేర్యాల సీఐ ఎల్.శ్రీను

కబ్జాదారులకు మద్దతు ఇస్తారా?

● నిలదీసిన గ్రామస్థులు

కల్హేర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): చెరువులో కబ్జాకు పాల్పడిన వ్యక్తికి అధికారులు వత్తాసు పలకడంతో రైతులు పెద్ద ఎత్తున చెరువు వద్దకు చేరుకుని అధికారులను నిలదీసిన సంఘటన మండల పరిధిలోని మార్డి పెద్ద చెరువు వద్ద గురువారం జరిగింది. హైదరాబాద్‌కు చెందిన ఒకరు మార్డి గ్రామ శివారులోని పెద్ద చెరువులో సుమారు ఎకరం భూమి కబ్జాకు పాల్పడి హద్దులు వేసుకున్నాడు. ఈ విషయమై మే 19న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. కల్హేర్ తహసీల్దార్ శివశ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు.ఆయన స్పందించకపోవడంతో ఉన్నతాధికారులకు ఫర్యాదు చేశారు. నీటిపారుదల శాఖ అధికారులు సర్వే చేపట్టి చెరువు భూమి కబ్జాకు గురైనట్లు కబ్జా చేసిన వ్యక్తిపై తెలంగాణ రెవెన్యూ భూముల ఎంక్రోచ్‌మెంట్ యాక్టు 1905 అండర్ సెక్షన్ 15ఏ ప్రకారం చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ అధికారులు నివేదిక ఇచ్చినట్లు రైతులు తెలిపారు. అయినప్పటికీ తహసీల్దార్ చర్యలు తీసుకుకోకుండా కబ్జాకు పాల్పడిన భూమిని చివరి భూమిగా చూపిస్తూ హద్దులు ఏర్పాటు చేయాల్సిందిగా గురువారం సూచించడంతో రైతులు భగ్గుమన్నారు. కబ్జాకు పాల్పడిన వ్యక్తిని వెనుకేసుకురావడం ఏమిటని ఆయనను నిలదీశారు. పెద్ద ఎత్తున ఆయకట్టు రైతులు, మార్డి గ్రామస్థులు చెరువు వద్దకు చేరుకోవడంతో వెనుకడుగు వేసిన తహసీల్దార్ నీటిపారుదల శాఖ అధికారులు చేపట్టిన సర్వే ప్రకారం హద్దులు ఏర్పాటు చేయడంతో కబ్జాకు పాల్పడిన చెరువు భూమితో పాటు కబ్జాకు పాల్పడిన వ్యక్తికి చెందిన మరి కొంత భూమి కూడా చెరువు పరిధిలోకి రావడంతో రైతులు శాంతించారు.

ప్రమాదాల జంక్షన్

●నెలలోనే ఇద్దరు మృతి
●రోజూ ఏదో ఒక ఘటన
●బ్రిడ్జి నిర్మించాలంటున్న స్థానికులు

రామాయంపేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రామాయంపేట జంక్షన్, కోమటిపల్లి గేటు వద్ద ప్రమాదాలు నిత్య కృత్యమయ్యాయి. హైదరాబాద్ వైపు నుంచి పట్టణ వెలుపలికి వాహనాలు వచ్చే చోట ఉన్న మలుపు ప్రయాణికులకు ప్రాణసంకటంగా మారింది. ఈ మార్గంలో నెలలోనే ఇద్దరు మృత్యువాత పడగా, పదుల సంఖ్యలో గాయాల పాలయ్యారు. సోమవారం కోమటిపల్లి గేటు వద్ద నడుచుకుంటూ వెళ్తున్న ఓ వృద్ధురాలిని బైకర్ ఢీ కొనగా, ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. నెల క్రితం బైక్‌పై వెళ్తున్న ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇదే జంక్షన్‌లో లారీ ప్రమాదంలో అక్కడికక్కడే చనిపోయాడు. రెండు నెలల క్రితం ఆర్టీసీ బస్సును కారు ఢీ కొట్టగా 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. అంతకుముందు ఖాళీ బాటిళ్ల లోడుతో వెళ్తున్న వ్యాన్ బోల్తా పడింది. అదేగాక నాలుగు నెలల కిందట ఇదే జంక్షన్‌లో రెండు కార్లు ఢీకొన్న ఘటనలో పలువురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఇలా బైపాస్ ఏర్పడ్డాక మలుపులో 30 మందికి పైగా ప్రాణాలు బలిపెట్టగా.. వందలాది సంఖ్యలో ప్రయాణికులు గాయపడ్డారు. అంతేగాక మరెన్నో ప్రమాదాలు త్రుటిలో తప్పిపోతున్నాయి. ఈ నేపథ్యంలో నాలుగు నెలల క్రితం కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రమాదకర జంక్షన్‌ని పరిశీలించారు. ప్రమాద నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. దీంతో రెండుసార్లు నేషనల్ హైవే అథారిటీ అధికారులు జంక్షన్ మూసివేసే ప్రక్రియ చేపట్టగా, మున్సిపల్ పరిధిలోని గొల్పర్తి గ్రామానికి చెందిన వారు అడ్డుకున్నారు. జంక్షన్‌కు అవతలివైపు తమ పొలాలు ఉన్నాయని, జంక్షన్ మూసేస్తే తాము పొలాలకు ఎలా వెళ్లాలన్నది వారి వాదన. ఈ నేపథ్యంలో ఇక్కడ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ వినిపిస్తోంది. జప్తి శివనూర్, చేగుంట, తూప్రాన్ ప్రాంతాల్లో నిర్మించిన విధంగా రామాయంపేట- కోమటిపల్లి వరకు బ్రిడ్జి ఏర్పాటుతో ప్రమాదాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.


అదుపుతప్పి పల్టీ కొట్టిన వ్యాన్(ఫైల్)

గుర్తు తెలియని వృద్ధుడు మృతి

కుకునూరుపల్లి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మంగోల్ బస్టాండ్‌లో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగోల్ బస్టాండ్‌లో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి ఓ వృద్ధుడు తడిసి, వణుకుతూ అక్కడ పడుకున్నాడు. గురువారం ఉదయం వృద్ధుడిని చూసిన ఓ గ్రామస్థుడు చనిపోయినట్లు గమనించాడు. విషయం పంచాయతీ కార్యదర్శికి తెలపగా కార్యదర్శి పోలీసులకు సమాచారం అందించారు. మరణించిన వృద్ధుడు 70 సంవత్సరాల వయస్సు, తెల్లని జుట్టు, ఐదు అడుగుల ఎత్తు, తెలుపు రంగు షర్టు ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. వృద్ధుడు చలికి తట్టుకోలేక మరణించినట్లు తెలుస్తోంది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నాడు.

క్రిమిసంహారక మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

గజ్వేల్ రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): క్రిమిసంహారక మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గజ్వేల్ మండలం ముట్రాజ్‌పల్లిలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముట్రాజ్‌పల్లి గ్రామానికి చెందిన మాదగారి రేగొండ(49) వ్యవసాయం చేసుకొని జీవితం సాగిస్తున్నాడు. రోజులాగానే పొలం వద్దకు వెళ్లాడు. మద్యానికి బానిసైన అతడు తాగడానికి డబ్బులు లేక జీవితంపై విరక్తి చెంది పొలం వద్ద చింత చెట్టు కింద క్రిమిసంహారక మందు తాగి అపస్మారక స్థితికి చేరాడు. భార్య మంజుల గమనించి కుటుంబ సభ్యుల సహాయంతో గజ్వేల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మరణించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న బైక్..


●యువకుడి మృతి

కొమురవెల్లి, జూన్26 (ఆంధ్రజ్యోతి): బైక్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఓ యువకుడు మృతి చెందగా, మరోక యువకుడు గాయాలతో బయటపడ్డాడు. ఈ ఘటన గురువారం తిమ్మారెడ్డిపల్లి కమాన్ నుంచి కొమురవెల్లి మండల కేంద్రానికి వెళ్లేదారిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మారెడ్డిపల్లి గ్రామ పరిధిలోని సార్లపల్లికి చెందిన తిరుపతి ఆంజనేయులు(24), సార్ల చరణ్ (16) అనే పదోతరగతి చదువుతున్న యువకులు ప్రయాణిస్తున్న బైక్ అదుపుతప్పి రోడ్డును ఢీకొన్న క్రమంలో అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా సార్ల చరణ్ మార్గమధ్యలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

కోహెడ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను గురువారం పట్టుకున్నట్లు ఎస్సై అభిలాష్ తెలిపారు. మండలంలోని పోరెడ్డిపల్లి గ్రామ శివారులో గల మోయతుమ్మెద వాగు నుంచి ఇందిరమ్మ ఇళ్ల కోసం అని మూడు ట్రాక్టర్ల ఇసుక లోడ్ తో పోరెడ్డిపల్లి గ్రామం నుంచి హుస్నాబాద్, అక్కన్నపేట మండలాలకు ఇసుకను తీసుకెళ్తున్నారు.దీంతో పోరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మంద చంద్రమౌళి, ఆసర్ల వంశీ, నాగసముద్రాలకు చెందిన ఈరాల రఫీక్‌లపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

విద్యార్థులకు కంప్యూటర్ ల్యాబ్


కంప్యూటర్ ల్యాబ్‌లో కంపెనీ ప్రతినిధులు

మద్దూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : హెచ్ఆర్ సాఫ్ట్‌వేర్ కంపెనీ సమాజసేవలో భాగంగా మద్దూరు మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌కు కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా పది ల్యాప్‌టాప్‌లను అందించింది. ఈ విషయమై మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అందె గణేష్ మాట్లాడారు. విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ లాంటి సాంకేతిక పరిజ్ఞానం గురించి సలహాలు సూచనలు అందించినట్లు తెలిపారు.

మూతబడిన పాఠశాల తెరుచుకుంది..!



పాఠశాలను ప్రారంభిస్తున్న ఎంఈవో ధనుంజయగౌడ్

అల్లాదుర్గం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : రెండేళ్ల క్రితం ఉపాధ్యాయులు లేని కారణంగా మూతపడిన అల్లాదుర్గం మండల పరిధి కాన్షీరాంనగర్‌లోని ప్రాథమిక పాఠశాల గురువారం తెరుచుకున్నది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ పాఠశాలకు ఉపాధ్యాయుడిని నియమించి ప్రారంభింపజేశారు. పిల్లలతో కలిసి ఎంఈవో ధనుంజయ్‌గౌడ్ రిబ్బన్ కట్ చేసి పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో విద్యార్థులకు విద్యాబోధనను చేస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలో కాకుండా, ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేయాలని కోరారు. మూతపడిన పాఠశాలను తిరిగి తెరిపించడం పట్ల కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాల రాష్ట్రస్థాయి పోటీలకు 14 మంది ఎంపిక

మెదక్ అర్బన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): క్రీడా పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి 4వ తరగతిలో ప్రవేశాల కోసం గురువారం మెదక్ స్టేడియంలో జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో ఎంపికైన 35 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. జిల్లాస్థాయిలో 8 మంది బాలికలు, ఆరుగురు బాలురు మొత్తం 14 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు జిల్లా యువజన క్రీడల అధికారి దామోదర్‌రెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు జూలై 1, 2 తేదీల్లో హకీంపేటలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులకు సన్మానం

సిద్దిపేట కల్చరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభను కనబరిచిన సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులను కళాశాల ప్రిన్సిపల్ డా.సునీత ఘనంగా సన్మానించారు. ఇటీవల నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర కామర్స్ అసోసియేషన్ నుంచి ఉత్తమ పరిశోధకుడిగా అవార్డు పొందిన డాక్టర్ గోపాల సుదర్శనం, మలేషియాలో అంతర్జాతీయ సెమినార్‌లో పాల్గొన్న డాక్టర్ జి.లీలావతి, నేపాల్‌లో జలవనరుల కాలుష్యంపై పత్ర సమర్పణ చేసిన డాక్టర్ మదన్మోహన్‌ను సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల కైవసం చేసుకున్న గుర్తింపు, ప్రత్యేకతలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా. పి.అయోధ్యరెడ్డి, డా.సీహెచ్ మధుసూదన్, పిట్ల దాసు, గురుచరణ్ అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యమ కళాకారులకు సాంస్కృతిక సారథిగా ఉద్యోగాలు కల్పించాలి

- 12 గంటల పాటల పల్లకి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- కవి, గాయకులు మద్దెల నర్సింలు, నేర్నాల కిషోర్

సిద్దిపేట కల్చరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమంలో ప్రజలను చైతన్యం చేసి, రాష్ట్ర సాధనలో కీలకంగా పనిచేసిన అర్హులైన ఉద్యమ కళాకారులకు సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు రాకపోవడం బాధాకరమని, ఇప్పుడైనా ఈ ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించాలని తెలంగాణ ఉద్యమ కవి, గాయకులు మద్దెల నర్సింలు, నేర్నాల కిషోర్ డిమాండ్ చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లా పాటల పల్లకిలో 12 గంటల కార్యక్రమానికి సన్నాహక సమావేశాన్ని గురువారం సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ ఉద్యమ కవి, గాయకుడు మద్దెల నర్సింలు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతో కలిసి నేర్నాల కిషోర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో సభను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎలాంటి తారతమ్యాలు లేకుండా ఉద్యమ కళాకారులందరూ ఏకతాటిపై కదిలి పాటల పల్లకిలో 12 గంటలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరారు. ఏ రోజున నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామన్నారు. సమావేశంలో టీపీసీసీ సాంస్కృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు చక్రాల రఘు, తదితరులు పాల్గొన్నారు.

'పేపరోళ్లకు చెప్పారు.. మేం డబ్బులివ్వం పోండి'

- జాలిగామ నిధుల గోల్‌మాల్ విషయంలో రైతులతో ఐకేపీ అధికారుల దురుసు ప్రవర్తన

గజ్వేల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ మండలం జాలిగామ గ్రామంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో జరిగిన అవకతవకలను 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం కాగా, రైతులతో నిర్వాహకులు, అధికారులు దురుసుగా మాట్లాడుతున్నారు. తమకు జరిగిన నష్టాన్ని అందజేయాలని రైతులు ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన ఐకేపీ కేంద్రం నిర్వాహకులకు ఆదేశాలిచ్చారు. గురువారం రైతులు ఐకేపీ అధికారులను సంప్రదించేందుకు ప్రయత్నించగా ఎవరూ అందుబాటులోకి రాలేదు. చివరికి ఓ అధికారిణి ఫోన్ లిఫ్ట్ చేసి 'మీరు పేపర్‌కు చెప్పారు కాదా.. మేం డబ్బులివ్వం.. ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి' అంటూ దురుసుగా మాట్లాడినట్లు రైతులు 'ఆంధ్రజ్యోతి'కి చెప్పి ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను దబాయిస్తున్న అధికారులపై వెంటనే జిల్లా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులకు నష్టపరిహారం చెల్లించేలా చూడాలని గ్రామానికి చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.



కందిలోని సంగారెడ్డి సెంట్రల్ జైలులో సీడ్‌బాల్స్ తయారు చేస్తున్న ఖైదీలు

జైళ్ల శాఖ పెట్రోల్ బంకులో.. సీడ్ బాల్స్ పంపిణీ

- పచ్చదనం పెంపొందించేందుకు వినూత్న ప్రయత్నం
- 25 వేల విత్తన బంతులు తయారు చేసిన ఖైదీలు

కంది, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : వానాకాలం మొదలైన నేపథ్యంలో కందిలోని సంగారెడ్డి సెంట్రల్ జైలు అధికారులు మొక్కల పెంపకం కోసం వినూత్నంగా ఆలోచించారు. కంది మండలం కాశీపూర్‌లోని జిల్లా కారాగారం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంకులో పెట్రోల్, డీజిల్, సీఎస్‌జీ గ్యాస్ కొట్టించుకోవడానికి వచ్చిన వాహనదారులకు గురువారం సిబ్బంది విత్తన బంతిని అందజేశారు. పెట్రోల్‌బంకులో పనిచేస్తున్న ఖైదీలు, సిబ్బంది ద్వారా ఇలా సీడ్స్ బాల్ అందజేస్తూ జైళ్లశాఖ ఆదర్శంగా నిలుస్తున్నది. ఈ విత్తనాల బంతులను వాహనదారులు రోడ్ల వెంబడి, ఖాళీ ప్రదేశాల్లో, అటవీప్రాంతాల గుండా వెళుతున్నప్పుడు విసరాలని సూచిస్తున్నారు. దీని ద్వారా ఎక్కువ మొక్కలు పెరిగి పచ్చదనం పెంపొందుతుందని జైళ్లశాఖ ఉద్దేశం. జైళ్ల శాఖ చేపట్టిన వినూత్న కార్యక్రమాన్ని చూసి వాహనదారులు ప్రశంసిస్తున్నారు. అయితే, సంగారెడ్డి సెంట్రల్ జైల్లో మొత్తం 25 వేల సీడ్ బాల్స్‌ను ఖైదీల ద్వారా తయారు చేయించామని, ప్రతీ ఒక్కరికి ఇలా అందజేయడం జరుగుతుందని జైలు పర్యవేక్షణ అధికారి కళాసాగర్ తెలిపారు.



సీడ్ బాల్స్ తయారీ ఇలా..

విత్తన బంతిని తయారు చేయడానికి జల్లెడ పట్టిన ఎర్రమట్టిని 75 శాతం, దానిలోకి 25 శాతం పేడ ఎరువును మిశ్రమంగా తీసుకోవాలి. ఈ మిశ్రమాన్ని కలిపి వారం పాటు మురుగబెట్టాలి. అనంతరం జీవామృతం (ఆవు మూత్రం, ఆవుపేడ, బెల్లం, శనగపిండి)తో మిశ్రమాన్ని ముద్దలుగా తయారు చేయాలి. విత్తనం పరిమాణం బట్టి దాని చుట్టూ మట్టి ఎంత వుండాలి అనేది నిర్ణయించుకోవచ్చు. విత్తనాల కొలతకు దాదాపు ఐదు రెట్ల మట్టి అవసరం అవుతుంది. విత్తనాల పరిమాణాన్ని బట్టి అవి మొలకెత్తే వరకూ సరిపోయే పోషణను కలిగి ఉండాలి. వర్షం ప్రారంభం కాగానే అందించడం మొదలై, అది పెరిగేందుకు సరిపోయేంత ఉండాలి. పది మిల్లీమీటర్ల నుంచి ఎనభై మిల్లీ మీటర్ల వ్యాసంతో బంతులను మన చేతులతో చుట్టుకోవాలి. ఈ మట్టిముద్దల్లో విత్తనాలను పెట్టి, వాటిని రెండు, మూడు రోజులు బాగా ఆరబెట్టాలి. పైపూతగా కాగితం గుజ్జు పూస్తారు. విత్తనాలను విడివిడిగా గుర్తుపెట్టుకునేందుకు రంగు రంగుల మార్కులు చేసుకోవచ్చు. ఈ బంతులు ఆరబెట్టి గట్టిపడిన తర్వాత వెదజల్లేందుకు తరలిస్తారు. జైళ్ల శాఖ తయారు చేయించిన విత్తన బంతుల్లో ఎక్కువగా వేప, చింత, కానుగా, వివిధ రకాల పూలు, పండ్లకు సంబంధించి విత్తనాలను నింపారు. కాగితం గుజ్జు లాంటిది బంతికి పూతగా వేయడం ద్వారా వాటిని బలంగా విసిరినప్పుడు వెంటనే పగిలిపోకుండా ఉంటుంది. వర్షం వచ్చినప్పుడు సీడ్‌బాల్‌కు తగిలిన నీటిని విత్తనానికి అందిస్తుంది. అది ఎదిగే దశలో జాగ్రత్తగా విచ్చుకుంటుంది. విత్తన బంతులు, మట్టి బంతి లోపల చుట్టబడిన వివిధ రకాల విత్తనాలను కలిగి ఉంటాయి. ప్రధానంగా ఎరుపు బంకమట్టి, హ్యూమస్ లేదా కంపోస్ట్ వంటి వివిధ పదార్థాలతో విత్తనాన్ని చుట్టి దీన్ని తయారు చేస్తారు. విత్తనాల చుట్టూ, బంతి మధ్యలో, సూక్ష్మజీవుల ఇనాక్యులెంట్లను అందించడానికి ఉంచుతారు. కాటన్-ఫైబర్స్ ద్రవీకృత కాగితం కొన్నిసార్లు బంకమట్టిలో దానిని బలోపేతం చేయడానికి కలుపుతారు.

ఢిల్లీలో ఎన్నికల కమిషన్ శిక్షకుడిగా తూప్రాన్ ఆర్డీవో

తూప్రాన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో కేంద్ర ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాలకు చెందిన ఎన్నికల అధికారులకు శిక్షణ నిర్వహిస్తుంది. ఈ కార్యక్రమానికి శిక్షకుడిగా తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి హాజరయ్యారు. తెలంగాణ, మిజోరాం, గుజరాత్, దయ్యుడామన్, త్రిపుర తదితర రాష్ట్రాల్లో ఎన్నికల అధికారులుగా విధులు నిర్వహించే కలెక్టర్లు, ఆర్డీవోలు, బీఎల్‌వోలు ఈ శిక్షణలో పాల్గొన్నారు. వారికి గురువారం ఆర్డీవో జయచంద్రారెడ్డి పలు అంశాలపై అవగాహన కల్పించారు.



వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అధికారుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న తూప్రాన్ ఆర్డీవో

వీరభద్రస్వామిని దర్శించుకున్న సీఎం సతీమణి తల్లిదండ్రులు

గుమ్మడిదల, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): గుమ్మడిదల మండలం బొంతపల్లి వీరన్నగూడెం వీరభద్రస్వామి ఆలయాన్ని గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సతీమణి తల్లిదండ్రులు పద్మారెడ్డి, పారిజాతమ్మ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలను నిర్వహించారు. స్వామివారి ఆలయానికి వచ్చిన వారికి కమిటీ, అర్చకులు ఆలయ సంప్రదాయాలతో సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మద్ది ప్రతాప్‌రెడ్డి, ఈవో శశిధర్ గుప్తా, సోమయ్య పాల్గొన్నారు.



పద్మారెడ్డి, పారిజాతమ్మను సన్మానించిన ఆలయ కమిటీ

అద్దె ఇంట్లో పోలీస్‌స్టేషన్

- మనోహరాబాద్‌లో ఏడేళ్లుగా కొలిక్కిరాని స్థలం
- పలువురు ఎస్పీలు చొరవ చూపినా లాభం లేదు
- సరైన వసతులు లేక సిబ్బందికి తప్పని తిప్పలు

మనోహరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో ఎంతో మంది ఎస్పీలు మారుతున్న మనోహరాబాద్ మండలం పోలీస్‌స్టేషన్ స్థలం మాత్రం కొలిక్కి రావడం లేదు. తూప్రాన్ ఉమ్మడి మండలం నుంచి మనోహరాబాద్ మండలంగా ఏర్పాటై ఏడేళ్లు దాటినా పోలీస్‌స్టేషన్‌కు మాత్రం సొంత భవనాన్ని నిర్మించలేకపోతున్నారు. ఇన్నేళ్లలో కనీసం స్థల కేటాయింపును కూడా పూర్తిచేయలేకపోయారు. ప్రస్తుతం పోలీస్‌స్టేషన్ మనోహరాబాద్ గ్రామ శివారులోని జాతీయ రహదారి పక్కన ఒక ప్రైవేటు వెంచర్‌లో అద్దె భవనంలో కొనసాగుతున్నది. ఇక్కడ పోలీస్ సిబ్బందికి సరైనా గదులు లేక పక్కనే ఉన్న మరొక గదిని అద్దెకు తీసుకుని వాడుకుంటున్నారు.

ఎస్పీలు మారినా..

గతంలో పలుమార్లు జిల్లా ఎస్పీలు మండలంలోని కూచారం, ముప్పిరెడ్డిపల్లి, మనోహరాబాద్ గ్రామాల్లో పలుచోట్ల స్థలాన్ని పరిశీలించారు. ప్రతీసారి స్థలాన్ని చూసి వెళ్లడమే తప్ప ఒక్కదానిని ఎంపిక చేయలేకపోయారు. మెదక్ జిల్లా ఏర్పడిన నాటి నుంచి ఎంతో మంది ఎస్పీలు మారుతూనే ఉన్నారు. కానీ ఒక్కరు కూడా స్థల కేటాయింపును పూర్తిచేయలేకపోయారు.



స్టేషన్ దారిలో రాత్రివేళ చీకటి

అద్దె ఇంట్లో అన్ని ఇబ్బందులే

మనోహరాబాద్ మండలంలో 44వ జాతీయ రహదారి కాళ్లకల్ నుంచి రామాయపల్లి వరకు సుమారు 9 కిలోమీటర్లు ఈ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుంది. నిత్యం ఎక్కడో ఒకచోట జాతీయ రహదారిపై ప్రమాదాలు జరుగుతునే ఉంటాయి. కేసుల నిమిత్తం ప్రమాదం జరిగిన వాహనాలను పోలీస్‌స్టేషన్ తరలిస్తుంటారు. పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందికి సరైన రెస్టు గదులు లేవు. స్టేషన్ మొత్తంలో ఒకే బాత్‌రూం ఉన్నది. దీంతో మహిళా సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. అలాగే గ్రామానికి అర కిలోమీటరు దూరంలో స్టేషన్ ఉన్నది. దీంతో రాత్రి వేళ ఫిర్యాదుదారులు స్టేషన్ రావాలంటే చీకట్లో ప్రయాణం చేయాల్సి వస్తుంది. దారి పొడవున ఎలాంటి ఇంటి నిర్మాణాలు, లైట్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. వానాకాలమైతే మనోహరాబాద్ ఎల్లమ్మ పెద్ద చెరువు నిండి ఆ నీరు మొత్తం రామాయపల్లి చెరువులోకి వస్తుంది. రామాయపల్లి చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోనే వెంచర్‌కు వెళ్లే దారి ఉంది. వర్షాలు ఎక్కువగా కురిసినప్పుడు ఈదారి గుండా కనీసం బైక్‌ల కూడా వెళ్లలేని దుస్థితి నెలకొన్నది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, దారి వెంట లైట్లు వేయాలని, నూతన పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



మనోహరాబాద్ శివారు ప్రైవేటు వెంచర్‌లోని అద్దె ఇంట్లో కొనసాగుతున్న పోలీస్‌స్టేషన్

వారం రోజుల్లో స్థల కేటాయింపునకు కృషి



మనోహరాబాద్ మండల కేంద్రంలో గతంలో రెండు చోట్ల స్థలం పరిశీలించారు. గతంలో జాతీయరహదారి వెంట సరైనా స్థలం కోసం పైఅధికారులు పరిశీలన చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారం రోజుల్లో పైఅధికారుల ఆదేశాల మేరకు స్థలం కేటాయింపును పూర్తిచేయిస్తాం. త్వరలోనే ఆధునిక భవన నిర్మాణం చేపడతాం.

- నరేందర్‌గౌడ్, డీఎస్పీ, తూప్రాన్

రాత్రివేళ స్టేషన్‌కు వెళ్లడం ఇబ్బందిగా ఉంది



మనోహరాబాద్ నూతన మండలం ఏర్పాటు చేసి ఎనిమిదేళ్లు కావస్తున్నది. ఇంకా ఇప్పటివరకు పోలీస్‌స్టేషన్‌కు స్థలం కేటాయించలేదు. గ్రామ శివారులో వెంచర్‌లో ఉండటంతో రాత్రి వేళల్లో ఫిర్యాదుదారులు చీకటిలో అక్కడికి వెళ్లాల్సి వస్తుంది. వర్షాకాలం వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. వెంటనే స్థలాన్ని కేటాయించి, భవనాన్ని నిర్మింపజేయాలని కోరుతున్నాం.

- పాశం మహిపాల్‌యాదవ్, మనోహరాబాద్

పెండింగ్ కేసులను పరిష్కరించాలి

- సిద్దిపేట జిల్లా ప్రధాన న్యాయాధికారి సాయిరమాదేవి

సిద్దిపేట క్రైం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి సాయిరమాదేవి తెలిపారు. రాష్ట్ర హైకోర్టు సూచనల మేరకు ఆమె సిద్దిపేట జిల్లా కోర్టులో జిల్లా న్యాయాధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పాత కేసులను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు జయప్రసాద్, వినోద్ కాంబ్లే, సంతోష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కొత్తగా 14 ఎక్సైజ్ స్టేషన్‌లు

హైదరాబాద్ రంగారెడ్డిల్లో 12, మెదక్, వరంగల్ డివిజన్‌లలో ఒక్కోటి

హైదరాబాద్ సిటీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వ్యాప్తంగా కొత్తగా 14 ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లు ఏర్పాటు కానున్నాయి. ఈనెల 28న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు లాంఛనంగా రంగారెడ్డిలో రెండు మెదక్‌లో ఒక స్టేషన్‌ను ప్రారంభిస్తారని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. కొత్తగా ఏర్పాటు కానున్న ఎక్సైజ్ స్టేషన్‌లకు సిబ్బంది కేటాయించే వరకు ప్రస్తుత ఇన్‌స్పెక్టర్‌లు ఇన్‌చార్జీలుగా కొనసాగుతారు. హైదరాబాద్, రంగారెడ్డి డివిజన్ పరిధిలో 12, మెదక్, వరంగల్ పరిధిలో ఒక్కొక్కటి చొప్పున ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో సంగారెడ్డి ఎక్సైజ్ స్టేషన్ నుంచి అమీన్‌పూర్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

సమష్టి కృషితోనే డ్రగ్స్ రహిత జిల్లా

సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య

సంగారెడ్డి క్రైం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : సమష్టి కృషితోనే డ్రగ్స్ రహిత జిల్లాగా సాధ్యమవుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య అన్నారు. మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి కలెక్టరేట్‌లో గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. సంగారెడ్డి జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చడానికి ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు. మాదక ద్రవ్యాల ముఠాలు విద్యార్థులనే లక్ష్యంగా చేసుకుంటున్నాయని తెలిపారు. విద్యార్థులు వాటి బారిన పడి, బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతున్నామని అన్నారు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ వివిధ శాఖల సమన్వయంతోనే డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చడం సాధ్యమవుతుందన్నారు. జిల్లా సంక్షేమాధికారి కె.లలిత కుమారి మాట్లాడుతూ మాదక ద్రవ్యాలను ఎవరైనా విక్రయించినా, రవాణా చేసినా పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి నవీన్‌చంద్ర, డీఎంహెచ్‌వో డా.గాయత్రి, డీఈవో వెంకటేశ్వర్లు, క్రీడల అధికారి ఖాసింబేగ్ తదితరులు పాల్గొన్నారు. సంగారెడ్డి మండల పరిధిలోని ఎంఎన్ఆర్ మెడికల్ కాలేజీలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య మాట్లాడుతూ చెడు అలవాట్లకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఎస్పీ పంకజ్ తదితరులు

న్యూస్ బాక్స్

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు జూలై 11 వరకు గడువు

దౌల్తాబాద్/కొండపాక, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మధ్యలో బడి మానేసి 15 ఏళ్లు దాటిన వయోజనులందరూ తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా 10వ తరగతి, ఇంటర్ విద్యను అభ్యసించవచ్చునని మండల విద్యాధికారి గజ్జెల కనకరాజు అన్నారు. గురువారం మండల వనరుల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, జూలై 11 వరకు గడువు ఉందన్నారు. దౌల్తాబాద్ మండలంలోని దొమ్మాట జడ్పీ పాఠశాలలో ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు అవకాశం ఉందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓపెన్ స్కూల్ ప్రవేశానికి ఆన్‌లైన్‌లో అడ్మిషన్ ఫీజు చెల్లించి ఫారం ప్రింట్‌ను అధ్యయన కేంద్రమైన దుద్దెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమర్పించాలని కొండపాక మండలం దుద్దెడ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మి కోఆర్డినేటర్ రజిని తెలిపారు.

హెచ్‌బీటీ తెలుగు పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

జగదేవ్‌పూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్ మండల కేంద్రంలో ఉన్న తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న హెచ్‌బీటీ తెలుగు పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ కాట స్లీవరాజు తెలిపారు. అర్హత (ఎంఏ, బీఈడీ, టీపీటీ, టెట్) కలిగిన అభ్యర్థులు ఈ నెల 28న ఉదయం 10 గంటలకు అప్లికేషన్, ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఆదర్శ పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

వంట మనుషుల కోసం..

ములుగు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తునికిబొల్లారం ఆర్అండ్ఆర్ కాలనీ కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో 2 అసిస్టెంట్ కుక్ పోస్టులు, 1 నైట్ వాచ్‌ఉమెన్ పోస్ట్ ఖాళీలు ఉన్నాయి. ఆసక్తి గల వారు జూన్ 26వ తేదీన మండల విద్యాధికారి ఉదయభాస్కర్‌రెడ్డి, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ అరుణను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు విద్యార్హత పదవ తరగతి పాసై ఉండాలని తెలిపారు. దరఖాస్తులకు ఆఖరి తేదీ జూలై 2 అని పేర్కొన్నారు.

వాటర్ ఫిల్టర్ బహూకరణ

కుకునూరుపల్లి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాయవరం ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు జయశ్రీ పాఠశాలకు వాటర్‌ఫిల్టర్‌ను అందజేశారు. పాఠశాల గదులను నూతనంగా వివిధ బొమ్మలతో ఆధునీకరించగా, వాటిని గురువారం కుకునూరుపల్లి ఎంఈఓ బచ్చలి సత్తయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మంజుల, పలువురు ఉపాధ్యాయులు, సీఆర్పీ సంతోష్ పాల్గొన్నారు.

క్రీడా పరికరాలు అందజేత

రాయపోల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ గజ్వేల్ ఆధ్వర్యంలో క్రీడా పరికరాలు అందజేశారు. చదువుతోపాటు ఆటల్లో రాణించాలని సభ్యులు విద్యార్థులకు సూచించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ సభ్యులకు పాఠశాల హెచ్‌ఎం హనుమంతరెడ్డితో పాటు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నాగరాజు, లయన్స్ క్లబ్ స్నేహ గజ్వేల్ అధ్యక్షులు మల్లేశం, ఉపాధ్యక్షులు డాక్టర్ కుమారస్వామి, ప్రతినిధులు సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్ల మాధ్యమ పుస్తకాలు, నోటుబుక్స్ పంపిణీ

మర్కుక్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అంగడికిష్టాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలోని 230 మంది విద్యార్థులకు స్పందన చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో ఆంగ్ల మాధ్యమ పుస్తకాలు అందజేశారు. అదేవిధంగా మ్యాకల కనకయ్య ముదిరాజ్‌భాగస్వామ్యంతో ప్రింటెడ్ హ్యాండ్ రైటింగ్ నోటు పుస్తకాలు, ప్రీ-ప్రైమరీ పిల్లలకు ఆంగ్ల మాధ్యమ సెమిస్టర్ పుస్తకాలు అందించారు. ప్రధానోపాధ్యాయులు బాలకిషన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి వెంకటరాములు హాజరై మాట్లాడుతూ అందరి సహకారంతో అంగడికిష్టాపూర్ ప్రభుత్వ పాఠశాల రాష్ట్రంలోనే ఉత్తమ ఆవిర్భవించిందన్నారు. ప్రతి సంవత్సరం పాఠశాల ప్రగతికి తన వంతు భాగస్వామ్యాన్ని అందిస్తానని మ్యాకల కనకయ్య ముదిరాజ్ ఈ సందర్భంగా తెలిపారు.

అన్నదాతలకు రూ.30 వేల కోట్లు ఎగ్గొట్టిన రేవంత్‌రెడ్డి : బీఆర్ఎస్

గజ్వేల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి రేవంత్‌రెడ్డి రూ.30 వేల కోట్లను ఎగ్గొట్టారని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతుభరోసాను ఎగ్గొట్టిందని, త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రైతుభరోసాను రైతుల ఖాతాల్లో జమచేసి ఓట్లను కొల్లగొట్టేందుకు యత్నిస్తున్నారని, తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

గజ్వేల్, ప్రజ్ఞాపూర్ బస్టాండ్‌లను అందుబాటులోకి తెస్తాం

- పంచాయతీ రాజ్ ఈఈ చిరంజీవాచారి

ఇంటర్వ్యూ



గజ్వేల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): త్వరలోనే గజ్వేల్, ప్రజ్ఞాపూర్ బస్టాండ్‌లను అందుబాటులోకి తీసుకువస్తామని గజ్వేల్ పంచాయతీ రాజ్ కార్యనిర్వాహక ఇంజనీర్ చిరంజీవాచారి అన్నారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో గజ్వేల్‌లో చేపడుతున్న పలు అభివృద్ధి పనులపై ఆయనతో ప్రత్యేక ఇంటర్వ్యూ...

ప్రశ్న: బస్టాండ్‌లను ఎప్పుడు వినియోగంలోకి తెస్తారు?

జవాబు: గజ్వేల్ బస్‌స్టాండ్‌ను రూ.2.56కోట్ల వ్యయంతో గడా స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్‌తో నిర్మించాం. ఇప్పటికే 90శాతం పనులు పూర్తయ్యాయి. మిగతా పనులను పూర్తి చేయడానికి రూ.35లక్షల నిధులు అవసరం కాగా, వేసి ప్రభుత్వానికి నివేదించాం. రెండు నెలల్లో గజ్వేల్ బస్టాండ్‌ను పూర్తి చేయడంతో పాటు ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం. ప్రజ్ఞాపూర్ బస్టాండ్ రూ.3.81కోట్ల వ్యయంతో నిర్మించాం. ఇప్పటికే 60శాతం పనులు పూర్తయ్యాయి. వందశాతం పూర్తి కావడానికి అదనంగా మరో రూ.95లక్షలు కావాల్సి ఉంది. మరో నాలుగు నెలల్లో బస్టాండ్ పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం

ప్రశ్న: గజ్వేల్ నియోజకవర్గంలో మినీ ఐఓసీల పనులు ఎప్పటిలోగా పూర్తవుతాయి...?

జవాబు: గజ్వేల్ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో మినీ ఐఓసీల నిర్మాణాలను చేపట్టాం. వర్గల్ మండలంలో భూసమస్యతో పనులు మొదలుకాలేదు. కొండపాక పూర్తవడంతో పాటు అందుబాటులోకి వచ్చింది. జగదేవ్‌పూర్, మర్కుక్, తూప్రాన్ మినీ ఐఓసీల పనులు 95శాతం పూర్తయ్యాయి. వాటిని త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తాం. మనోహరాబాద్ పనులు 60శాతం పూర్తవగా, త్వరలోనే పూర్తి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ములుగులో రూఫ్ లెవల్ వరకు పనులు వచ్చాయి.

ప్రశ్న: కొత్తగా గజ్వేల్ డివిజన్‌కు ఏవైనా అభివృద్ధి పనులు మంజూరయ్యాయా...?

జవాబు: గజ్వేల్ నియోజకవర్గంలో ఎంఎన్ఆర్ఈజీఎస్‌లో భాగంగా కొత్తగా రూ.20లక్షలతో గ్రామపంచాయతీ భవనం, రూ.8లక్షల వ్యయంతో 15 అంగన్వాడీ భవనాలు మంజూరయ్యాయి. వాటి పనులను త్వరలోనే ప్రారంభిస్తాం. కొత్తగా గ్రామీణ రోడ్లకు రూ.36.95కోట్లు మంజూరయ్యాయి. సదరు పనులు టెండర్, అగ్రిమెంట్ దశలలో ఉండగా, ఎస్సీ సబ్‌ప్లాన్ కింద సీసీ రోడ్లు, డ్రైనేజీలు మంజూరయ్యాయి. మొత్తం 127 పనులను రూ.12.70కోట్లతో వ్యయంతో 10పనులను ప్రారంభించనున్నాం. గ్రామీణ రోడ్ల మరమ్మతులకు గానూ 25 రోడ్లకు రూ.22.60 కోట్లు, కొత్తగా తొమ్మిది బీటీ రోడ్డు పనులకు రూ.14.96 కోట్లు మంజూరయ్యాయి. ప్రస్తుతం అవి టెండర్ దశలో ఉన్నాయి. త్వరలోనే అన్ని పనులను పూర్తి చేస్తాం.

రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి

సిద్దిపేట క్రైం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ కె. హైమావతి అధికారులకు సూచించారు. గురువారం ఐడీఓసీ సమావేశ మందిరంలో పోలీస్, నేషనల్ హైవే, సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజీవ్ రహదారి వెంట సర్వీస్ రోడ్డు లేకపోవడం వలన రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, మూలమలుపుల వద్ద రోడ్డు కనిపించకుండా ఆవరించిన మొక్కలు, చెట్ల పొదలను తొలగించాలన్నారు అనంతరం నిర్వహించిన డ్రగ్ కంట్రోల్‌పై సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటివరకు డీ-అడిక్షన్ సెంటర్‌ను సంప్రదించిన బాధితులు, వారికి అందించిన కౌన్సిలింగ్, చికిత్స మరియు నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఈఓ, డీఈ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, పోలీస్ మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని చేరుకోవాలి

సిద్దిపేట కల్చరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నిర్దేశించిన లక్ష్యాలను బ్యాంకులు పూర్తి చేయాలని కలెక్టర్ కె. హైమావతి ఆదేశించారు. గురువారం ఐడీఓసీలోని సమావేశమందిరంలో నిర్వహించిన లీడ్ బ్యాంక్ డీసీసీ (డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ), డీఎల్ఆర్‌సీ (డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ) సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మొదటగా ఖరీఫ్ సీజన్ కొరకు క్రాప్, ఇన్‌ఫ్రా మొదలైన రంగాల్లో నిర్దేశించిన రుణాలను రైతులకు అందించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు గరిమా అగ్రవాల్, అబ్దుల్ హమీద్, డీఆర్‌డీఓ, ఎల్‌డీఎం, ఇతర బ్యాంక్ అధికారులు, బ్యాంక్ మేనేజర్‌లు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌ల రద్దుకు పోరాటం

- సీఐటీయూ

హుస్నాబాద్ రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కార్మిక వర్గానికి గొడ్డలిపెట్టుగా ఉన్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకూ నిర్విరామంగా పోరాటం చేస్తామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ పేర్కొన్నారు. జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెపై గురువారం హుస్నాబాద్ ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డికి సీఐటీయూ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం కార్మికుల సమావేశంలో రవికుమార్ మాట్లాడారు. 2021లో బీజేపీ ప్రభుత్వం 29 రకాల కార్మికుల చట్టాలను రద్దు చేసి, బడా కార్పొరేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా నాలుగు రకాల లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందన్నారు. సమ్మెను విజయవంతం చేసేందుకు కార్మికులంతా కదలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మెప్మా ఆర్పీ యూనియన్ నాయకులు పద్మ, సరిత, శోభ, సరళ, మున్సిపల్ యూనియన్ నాయకులు సారయ్య, ప్రభాకర్, సతీష్, గ్రామ పంచాయతీ యూనియన్ నాయకులు సంపత్, మహేందర్, సదానందం ఉన్నారు.

పీఎంఎఫ్‌ఎంఈ యూనిట్లపై అవగాహన సదస్సు

అక్కన్నపేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అక్కన్నపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం ఐకేపీ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ఆహారోత్పత్తుల తయారీ యూనిట్లు (పీఎంఎఫ్‌ఎంఈ) పై మహిళా సంఘాల సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీఆర్డీవోలు సుధీర్, రవికుమార్ మాట్లాడుతూ ఒక్కో యూనిట్‌కు రూ.లక్ష నుంచి రూ.35 లక్షల వరకు రుణాలు ఇస్తామన్నారు. 39 మంది మహిళా సభ్యులు ఈ రుణాలకు దరఖాస్తులు తీసుకున్నట్లు వారు తెలిపారు. ఈ సదస్సులో ఐకేపీ ఏపీఎం గొడిశాల శ్రీనివాస్, సీసీలు గొర్ల తిరుపతి యాదవ్, గిరిమల్ల రాజు, శివ చరణ్ సింగ్, శ్రీలత, సమైఖ్య అధ్యక్షురాలు అశ్విని, శ్వేత తదితరులు ఉన్నారు.

అమాత్యులారా.. జర ఆలకించండి

- హుస్నాబాద్-జనగామ హైవే పనులూ చేపట్టండి

హుస్నాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ నుంచి జనగామ వరకు హైవే నిర్మాణానికి శ్రీకారం చుట్టాలని స్థానికులు మంత్రులను కోరుతున్నారు. కరీంనగర్ రాజీవ్ రహదారి (కొత్తపల్లి) నుంచి హుస్నాబాద్ వరకు నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి శుక్రవారం మంత్రుల బృందం శంకుస్థాపన చేస్తున్న సందర్భంగా విజ్ఞప్తి చేస్తున్నారు. గత ప్రభుత్వం హామీ ఇచ్చినా ఇది అమలు కాలేదని, కేంద్ర ప్రభుత్వం దీనిని గుర్తించినా ఆచరణలో పెట్టలేదని చెబుతున్నారు. నేడు హుస్నాబాద్‌కు వస్తున్న మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, దామోదర రాజనర్సింహ అత్యంత ప్రాధాన్యత కలిగిన ఈ రోడ్డు నిర్మాణంపై హామీ ఇవ్వాలని కోరుతున్నారు. ఈ రహదారి నిర్మాణం జరిగితే రవాణా పరంగా అనేక ప్రయోజనాలు కలుగుతాయని, అంతరాష్ట్ర రవాణాతో పాటు రాష్ట్రంలోని మూడు జిల్లాలకు రాకపోకలు సులువు అవుతాయని చెబుతున్నారు.

దేవాదాయ భూముల జోలికి వస్తే ఊరుకోం : బీజేపీ



గజ్వేల్ ఆర్డీవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న బీజేపీ నాయకులు

గజ్వేల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ భూముల జోలికి వస్తే ఊరుకోమని గజ్వేల్ పట్టణ బీజేపీ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్ హెచ్చరించారు. గజ్వేల్ పరిధిలోని సర్వే నంబర్ 338 స్థానిక శివాలయానికి సంబంధించిన భూమిని గజ్వేల్‌కు చెందిన కొందరు వ్యక్తులు కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ భూమిని రక్షించాలని గజ్వేల్ ఆర్డీఓ, తహసీల్దార్లకు గురువారం గజ్వేల్ బీజేపీ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు నాగు ముదిరాజ్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ దేవస్థానానికి సంబంధించిన భూమిలో ఐఓసీ ప్రభుత్వ కార్యాలయాన్ని నిర్మించగా, దాని వెనకాల ఖాళీగా ఉన్న స్థలాన్ని తమకు నష్టపరిహారం కింద కేటాయించిందని చెబుతూ కొంతమంది కాజేయాలని చూస్తున్నారని ఆరోపించారు. భూమి నష్టపోయిన వారికి తగిన నష్టపరిహారం నగదు రూపంలో ఇవ్వడం జరిగిందని, ఎవరికి భూమికి బదులు భూమి అని ఎక్కడ ఇవ్వలేదన్నారు. ఈ భూమి జోలికి వస్తే బీజేపీ ఆధ్వర్యంలో పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గజ్వేల్ బీజేపీ సీనియర్ నాయకులు మధుసూదన్, శశిధర్‌రెడ్డి, శివకుమార్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు

డెడ్‌లైన్ ఆగస్టు 15

(5వ పేజీ తరువాయి)

మిస్సింగ్‌లు, తప్పులు, మార్పులు చేర్పులు, భూ విస్తీర్ణం, ప్రభుత్వ భూమికి సంబంధించి ఇలా 39 రకాల్లో దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలోని 25 మండలాల్లో అత్యధికంగా దుబ్బాకలో 3 వేలకు పైగా దరఖాస్తులు రాగా అత్యల్పంగా మద్దూరులో 600కు పైగా దరఖాస్తులొచ్చాయి. వీటిలో సాదాబైనామా, పీవోటీ, మిస్సింగ్ సర్వే నంబర్లు, విస్తీర్ణం, అసైండ్‌ల్యాండ్, సక్సేషన్ కోసం అత్యధికంగా దరఖాస్తులు అందాయి.

ఆన్‌లైన్‌లో నమోదు.....

జిల్లా వ్యాప్తంగా స్వీకరించిన దరఖాస్తులను అధికారులు, సిబ్బంది ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. కాగా ఇప్పటివరకు జిల్లాలో 80 శాతానికి పైగా దరఖాస్తులను అధికారులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయగా, మిగతా దరఖాస్తులను కూడా త్వరలోనే చేయనున్నారు. దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ అనంతరం స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారంలో భాగంగా ముందుగా సమస్యలపై ఇరు పార్టీలకు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం గ్రామాలకు వెళ్లి అధికారులు నోటీసులను జారీచేయనున్నారు. దరఖాస్తుల్లో సాదాబైనామా విషయానికి వస్తే ఇరుపార్టీల్లో భూమి అమ్మిన వ్యక్తికి ఏమైనా అభ్యంతరాలు ఉన్నాయా అని, కొన్న వ్యక్తికి ఏదైనా ఇబ్బందులు తలెత్తుతున్నాయా అని, అందుకు గానూ లిఖితపూర్వకంగా అధికారులకు అందజేయాలని నోటీసులో పేర్కొంటారు. అనంతరం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పంచనామా చేసి, స్టేట్‌మెంట్‌ను రికార్డు చేయనున్నారు.

విద్యార్థుల నడ(ర)క యాతన

(5వ పేజీ తరువాయి..)

విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. వర్షాకాలం విద్యార్థుల బాధలు వర్ణనాతీతం.

ప్రతిపాదనలకే పరిమితం..

ఈ కళాశాలకు పది ఎకరాల స్థలం ఉంది. కళాశాల ప్రాంగణంలో బాలికలు, బాలుర హాస్టళ్లు ఏర్పాటు చేయాలని విద్యార్థులు నాలుగు సంవత్సరాలుగా కోరుతున్నారు. హాస్టళ్లు ఏర్పాటు చేస్తే తమ ప్రధాన సమస్య పరిష్కారం అవుతుందని విద్యార్థులు పేర్కొంటున్నారు.



కళాశాల వెళ్లే రోడ్డు దుస్థితి

ఖాళీ పోస్టులు..

పాలిటెక్నిక్ కళాశాలలో అనేక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కళాశాల ప్రిన్సిపాల్ డిప్యూటేషన్‌పై వచ్చారు. హెడ్ ఆఫ్ సెక్షన్ పోస్టులతో పాటు లైబ్రేరియన్, ఫిజికల్ డైరెక్టర్, ఇతర లెక్చరర్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో పాఠ్యాంశాలతో పాటు ఇతర విభాగాల్లో విద్యార్థులు నష్టపోతున్నారు.

ఈ సంవత్సరమే తరగతులు..

హుస్నాబాద్‌కు మంజూరైన ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల తరగతులను ఈ సంవత్సరం ఇదే కళాశాలలో నిర్వహించనున్నారు. ఇంజనీరింగ్‌లో ఈసీఈ, సీఎస్ఈ, ఈటీ, ఏఐ కోర్సులను మంజూరు చేశారు. ప్రతి విభాగంలో 60 సీట్లకు గాను 240 మంది విద్యార్థులు ఈ సంవత్సరం ఈ కళాశాలలో విద్యనభ్యసించనున్నారు. అలాగే హుస్నాబాద్‌కు మంజూరైన న్యూ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)ను ఇదే కళాశాలలోని 1.20 ఎకరాల్లో నిర్మించనున్నారు. దీని దృష్ట్యా హుస్నాబాద్ నుంచి కళాశాల వరకు బస్సు నడిపించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

'అవగాహనతోనే టీబీ నిర్మూలన'

నంగునూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అవగాహన ద్వారానే టీబీ నివారించవచ్చని రాజగోపాలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెచ్‌ఈఓ స్వామి అన్నారు. గురువారం నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలో 'టీబీ ముక్త భారత్' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. రెండు వారాలకు మించి దగ్గు ఉన్నట్లయితే వెంటనే టీబీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురికి బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శ్రీనివాస్, టీబీ యూనిట్ సూపర్‌వైజర్ రాజు, హెల్త్ అసిస్టెంట్లు మహేందర్, లింగంగౌడ్, ఏఎన్‌ఎం జ్యోతి, ఆశ వర్కర్లు మన్నెమ్మ, బాలలక్ష్మి, కవిత, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

- జిల్లావ్యాప్తంగా అవగాహన ర్యాలీలు

న్యూస్ నెట్‌వర్క్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా పోలీసులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై విద్యార్థులకు, యువతకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మహిళల రక్షణ చట్టాలు, షీ టీంల విధులను వివరించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలన్నారు. మత్తు పదార్థాల అక్రమ రవాణాపై సమాచారం ఉంటే 1908 టోల్ ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పోలీసులు హామీ ఇచ్చారు.



అక్కన్నపేటలో డ్రగ్స్ నిర్మూలనపై మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు



చెత్త, వ్యర్థాలు తొలగించి దారి పక్కన గ్రీన్‌నెట్ కడుతున్న సిబ్బంది

రోడ్డు పక్కన చెత్త తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చేర్యాల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం కడవేరుగు గ్రామ శివారులో రోడ్డు పక్కన కొద్దిరోజులుగా డంప్ చేస్తున్న చెత్త, వ్యర్థాలను గ్రామ పంచాయతీ అధికారులు ఎట్టకేలకు తొలగించారు. గ్రామంలో డంపింగ్ యార్డు ఉన్నప్పటికీ, చేర్యాల-నాగపురి ప్రధాన రహదారి పక్కన చెత్త డంప్ చేయడంతో దుర్వాసన వెదజల్లి స్థానికులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని గురువారం 'ఆంధ్రజ్యోతి'లో అటకెక్కిన స్వచ్ఛత శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎంపీవో మహబూబ్ అలీ సూచన మేరకు గ్రామ పంచాయతీ సిబ్బంది ఎక్స్‌కవేటర్‌తో చెత్తను తొలగించి, రోడ్డు పక్కన వ్యర్థాలు పారబోయకుండా గ్రీన్ నెట్ ఏర్పాటు చేశారు. ఇకనుంచి చెత్తను డంపింగ్ యార్డుకే తరలిస్తామని తెలిపారు.

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

- డీఏవో రాధిక



ఫర్టిలైజర్ షాపులో రికార్డులను తనిఖీ చేస్తున్న డీఏవో రాధిక

చిన్నకోడూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఏవో రాధిక హెచ్చరించారు. ఆమె గురువారం చిన్నకోడూరు మండలం రామంచ, చిన్నకోడూరు, గంగాపూర్, సికింద్లాపూర్ గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు, ఈ-పోస్ యంత్రాల ద్వారా జరిగిన విక్రయాలను పరిశీలించారు. రైతులకు ఎరువులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, విక్రయాలు తప్పకుండా ఈ-పోస్ యంత్రం ద్వారానే జరపాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో జయంత కుమార్ పాల్గొన్నారు.

- బెజ్జంకి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులను గురువారం వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీ చేశారు. యూరియా బస్తాల నిల్వలను, రికార్డులను పరిశీలించారు. ఈ-పోస్ యంత్రంతోనే ఎరువులు అమ్మాలని ఏవో సంతోష్ సూచించారు.

ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి : ఏసీపీ



కేసుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఏసీపీ నర్సింహులు

జగదేవ్‌పూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్‌కు వచ్చే దరఖాస్తుదారులతో మర్యాదగా మాట్లాడి, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కారమయ్యే విధంగా చూడాలని గజ్వేల్ ఏసీపీ నర్సింహులు అన్నారు. గురువారం ఆయన జగదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించి ఆవరణలో మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఏసీపీ నర్సింలు మాట్లాడుతూ సీజ్ చేసిన వాహనాలను సంబంధిత యజమానులకు సాధ్యమైనంత త్వరగా అందజేయాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ముందస్తు సమాచారాన్ని సేకరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, జగదేవ్‌పూర్ ఎస్సై చంద్రమోహన్, ఏఎస్ఐ రమణారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని బీజేపీ ఆందోళన



ఎంపీడీవో కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కోహెడ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అవినీతి, అక్రమాలను అరికట్టి అర్హులైన నిరుపేదలకు ఇళ్లు సకాలంలో కేటాయించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కోహెడ మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్లు అనర్హులకు, కాంగ్రెస్ పార్టీ అనుచరులకు కేటాయించారని ఆరోపించారు. ఆరు గ్యారంటీల వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్ల కోసం ప్రజలను మభ్యపెడుతుందని దుయ్యబట్టారు. అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేంత వరకు పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఎంపీడీవో అందుబాటులో లేకపోవడంతో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా పార్టీ కౌన్సిల్ మెంబర్ ఖమ్మం వెంకటేశం, బీజేపీ మండల అధ్యక్షుడు జాలిగాం రమేష్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

గ్రామ సంఘాల పదాధికారులకు శిక్షణ



అవగాహన కల్పిస్తున్న సీఆర్పీలు

మద్దూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గ్రామ సంఘాల్లోని నూతన పాలక వర్గాల పదాధికారులకు విధులు-బాధ్యతలపై మండల కేంద్రంలోని జాగృతి సమాఖ్య కార్యాలయంలో సెర్ప్ సీఆర్పీలు ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఆర్పీలు బి. విద్యారాణి, పి. వెంకటరమణ మాట్లాడుతూ మద్దూరు, రేబర్తి క్లస్టర్ గ్రామాలకు చెందిన గ్రామ సంఘాల్లోని పదాధికారులకు ఆయా సంఘాలలో నిర్వహణ, విధులు, బాధ్యతలపై పూర్తి అవగాహన కల్పించారు. గ్రామ సంఘాల్లో జరిగే నిర్ణయాలు ఎవరు చేయాలి, ఆ నిర్ణయాలు ఏ విధంగా ఉండాలి, మనకు అనుకూలంగా ఉన్నాయా లేవా అనే పలు అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం బాబురావు, సీసీలు ప్రేమలత, మహేందర్, నర్సయ్య, కంప్యూటర్ ఆపరేటర్ వరలక్ష్మి, గ్రామ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చేర్యాల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం ఆకునూరు, కాశీగుడిశెలు గ్రామాలకు చెందిన పలువురికి సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కొమ్ము రవి గురువారం ఆకునూరు గ్రామంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మంజె మల్లేశం, అందె నాని, కరెడ్ల మాధవరెడ్డి, భూమని బాలరాజు, ఆకుల రాజు, షరీఫ్, హైమద్, కనకయ్య, తాటికొండ రాములు, రఘువీర్, రణం శ్రీకాంత్ పాల్గొన్నారు.